# ఆశాశకురుపు

వొద్దని నేనూ, వొదినా గోలపెడుతున్నా వినక, మా గోలంతా పెడచెవిని పెట్టి, అన్నయ్య ముంచుకుపోయినట్టు పోయినాడు వూరికి. ఆ మధ్యాహ్నం, తన పాటలు వాళ్ళు వింటేనేగాని వాళ్ళకు గతులు లేనట్టు. మేము ముగ్గురమూ శలవలు ఆ పదిరోజులూ యింట్లోచేసిన అల్లరీ, ఆటలూ, పోట్లాటలూ, ఎత్తిపొడుపులూ, పాటలూ, అన్నీ "ఒక్కసారిగా చల్లబడి. అతను వెళ్ళడంతోటే చప్పున ఆగిపోయి, మేమిద్దరమూ ఒకరి మొహాలు ఒకరం చూసుకోలేక తిట్టుకుంటామా అన్నంత తోచకుండా అయింది మాపని. గది కిటికీదగ్గిర కూచుని రోడ్డుమీదపోయే ప్రతివాళ్ళని వెక్కిరించుకొని, ఆకలేస్తుందనుకొని రెండుసార్లు వుప్మా కాఫీ చేసుకొని, యెన్నడూలేనిది హటాత్తుగా దుర్గమ్మత్తకి. ప్రేమతో ఆరుపేజీల వుత్తరం వ్రాసి, హార్మోనియంలోంచి మాలోలేని సంగీతాన్ని రప్పించలేక దాన్ని విరకొట్టి, అన్నయ్య గడియారం ఆలస్యంగా తిరుగుతోందని దాన్నంతా విప్పిపెట్టి-పొద్దు గడిపాం.

మర్నాడు మధ్యాహ్నానికి యిల్లు తగలబెడదామా, పొరుగింటిదొడ్లోకి రాళ్ళు విసురుదామా, జుట్టు కత్తిరించుకుందామా, అనే ఆలోచనవరకూ వచ్చింది మాస్థితి. పదోసారి గతిలేక ఆ 'శశిరేఖ' మళ్ళా చదువుతూండగా గూటిదగ్గిర కూచున్న వొదిన, 'వొదినా, యిట్లారా తమాషా చూపిస్తా' ననేటప్పటికి నాప్రాణాలు లేచివొచ్చి, ఆపాడు వెంకటచలం పుస్తకాన్ని

క్కడ పారేసి, గూటిదగ్గిరికి పరిగెత్తాను. కిటికీకి యెదురుగా ఒక పెద్ద మనిషి నుంచుని వున్నాడు. కళ్ళకి జోడు, జాగ్రత్తగా అర్ధశేరు అగరు నూనె రాసి దువ్విన గిరజాలూ, షర్టు, మడతవుత్తరీయం అతన్ని చూడ గానే నేను వెనక్కి తగ్గాను. తలతిప్పి వొదిన్నిచూసి, అర్థయుక్తంగా చిరు నవ్వు నవ్వాడు; వొదిన యేంచేసిందో నాకు కనబళ్ళేదు. కాని అతను మెల్లిగా కిటికీదగ్గిరికి జరిగాడు. వొదిన చప్పున లోపలికి వొచ్చి కిటికీ తలుపు దబాలున వేసి బిగ్గరగా నవ్వి, వొచ్చి నవ్వుతో పరుపుమీద నాతో కూడాపడి, గట్టిగా నన్ను కావిలించుకుంది. నాగుండెలు దబదబా కొట్టు కున్నాయి భయంతో. యేమిటీ సాహసం! అన్నయ్యతో యింతప్రేమగా మనసు కలిసివున్న వొదినేనా! నన్నుకూడా యీడుస్తోందేమిటి? ఆ అస హ్యపు వ్యవహారంలోకి?

ఆ వెంకటచలం పుస్తకాల్లోనేగాని లోకంలో యిల్లాంటి సంగతులు వుంటాయనుకోలేదు.

"చూశావా?"

"యేమిటది?"

"అదే."

"అంటే?"

"వాణ్ణి చూశావా? ఆ మూతి కాలినవాణ్ణి?"

"మూతి బాగానే వుందే?"

"బాగావుంటే ముద్దెట్టుకో."

"నువ్వాపని చేశావ? చెయ్యబోతున్నావా?"

"నేనా?"

"పోనీ, వాడు!"

"వాడా! వాడి తరమా!"

"మరి ఈ నాటకం యేమిటి?"

"మీ అన్నయ్యవలె నువ్వూ తొందరపడకు; వినుమరి. ఒకరోజున నన్ను కిటికీదగ్గిర చూసి, యీ వెధవ ప్రతిరోజూ ఆవేళకే యిట్లా పోవడం వూరికే తొంగి చూడడం, నేను కనబడకపోతే నేను వచ్చిందాకా యెండలోపడి వుండడం ప్రారంభించాడు. మీ అన్నయ్యతో చెపుదామా వొద్దా అని ఆలోచిస్తోవుండగా, ఒకరోజు మధ్యాహ్నం వాడు రాలేదు. ఆవేళ నాకేమీ తోచలేదు. అదిగాక వాడు నన్ను అంత వాంఛతో కోరడం నాకు చాలా గర్వంగా, సంతోషంగా వుంది. వాడిమీద నాకు ప్రేమ వొచ్చిందనుకోకు. ఆ వెధవమీదా? కాని వాడు రావటం అలవాడయింది. చలికాలంలో సాతానివాడూ, రాత్రి మాధాకరంవాడూ అలవాటైనట్టే. ఇంతలో యేం పోయింది? ఇంతమాత్రం తమాషా లేకుండా బతకడ మెట్లా! మొగాళ్ళ కెన్నోతమాషాలుంటాయి జీవితంలో. క్లబ్బులూ, ఆటలూ, పార్టీలూ, షికార్లూ! మనకేముంది? వంటా, చాకిరీ, చచ్చు పేరంటాలూ! పొద్దున్నా, రాత్రీ యింతే! వాళ్ళకేం? ఎంతమంది ఆడ వాళ్ళని చూస్తారో, మనకేం తెలుసు? కాస్త మొగాళ్ళకేసి చూస్తే మనకి తిట్లు. మనమూ మనుషులమేనా? ఐనా తప్పేంచేశాను? నా చంపల్లోన్నే, జుట్టునోచూసి, వాడు ముగ్ధుడై గంటలకొద్దీ రోడ్డుమీద పడివుంటే, యెవరికేం కష్టం? వాడికంటావా? కష్టంగావుంటే ఎండ నెత్తిమీద మాడుతూ యెందుకు నుంచుంటాడు? వాడికీ ఆనందమే! అపాయంలేని వాడి ఆనందాన్ని మన మెందుకు చెడగొట్టాలి? ఆనందమివ్వడం పుణ్య కార్యమా కాదా? ఈ సంగతి మొగాళ్ళకి అర్థంకాదు! 'నా జుట్టు అందం వంక మీరు చూడగానే చూడరు. కాని ఆ జుట్టుని ఒక్కసారి చూడ్డానికి ఒక పెద్దమనిషి అరగంట యెండలో మాడుతూ నుంచున్నాడు; మీ భార్యనైన నా అందం చాలామంది మెచ్చుకుంటున్నా'రంటే, మీ

అన్నయ్య యేమాత్రం సంతోషిస్తారు? పోనీ ఆయన నా అందాన్ని మెచ్చు కుంటారా? నా అందం ఆయనకి మామూలు, ఆకాశం నీలంమల్లే, గడ్డి పచ్చదనంమల్లే! పోనీ యింకోకరు మెచ్చుకుంటే సంతోషిస్తారా? ఏదీ లేదు. మామూలుగా రాత్రి పదింటికి పక్కన పడుకుని మూసినకళ్ళు తెల్ల వారిందాక తెరవరు. అర్ధరాత్రి నిద్రలేపి 'ఏమండీ వాడిందాకి నా కళ్ళ అందాన్ని చూసి చూసి మురిశాడు, ఆ కళ్ళు తనని చూసేవాళ్ళు లేక రాత్రంతా యేడుస్తున్నాయి' అంటే యేమంటారు ? అంతేకాదు, నేను యాడాది పుట్టింటో వుంటే, హోటలుభోజనం వొంటికి పడడంలేదు, వెంటనే రమ్మని వ్రాశారుగాని నా పెదిమల అందం కనపట్టంలేదని కాని, నా చెంపల నునుపు ఆయన్ని విరహంలో ముంచిందనిగాని వ్రాశారా? అంతగా ఐతే మహా, నువ్వు దగ్గిరలేకపోతే కష్టంగా వుంది అంటారు. అంటే మన మర్థంచేసుకోవాలి ఆ కష్టమేమిటో. కనక మనకి పెదిమలూ, కళ్ళూ వున్నాయనీ, వాటికో అందం యేడిసిందనీ, ఎంత త్వరలో మరచిపోతే అంత మంచిది. నీ నేత్రాలు భ్రమరాలమల్లే వున్నాయనడం లేనేలేదూ కదా, పైగా 'నీకు కళ్ళు కనపట్టంలేదు, గుడ్లు మీది కొచ్చినట్టున్నాయి' అంటారు. మీ అన్నయ్యకి ప్రేమ లేదనికాదు. వుంది కాని యివన్నీ చూడ దా ప్రేమ. ఇట్లాంటి కిటికీల పెద్దమనుష్యులే మన సౌందర్యాన్ని గుర్తించి మనకి ఆనందం కలుగచేసేది. వీళ్ళని వొదులుకుంటే జీవితానికి మెరుగేదీ? ఇంతవరకూ వాడికి నేను యిచ్చిం దల్లా కొలుకుల్లోంచి అప్పుడప్పుడు ఒక్కచూపు. దానికోసం కుక్కవలె అట్లా గుమ్మంలో పడివుంటాడు. ఇంత చవకగా పహరావాణ్ణి సంపాయించ గలవా యింకోవిధంగా!" అంది.

నా మనస్సు సమాధానపడలేదు, అనుభవం తక్కువ కావడం చేతనేమో.

తప్పింకమా, వాడిమీద మనస్సు వుంటే నీకు అనుకోవచ్చు. కన్నుతో వేలుతో అతన్ని కోతి నాడించినట్లు ఆడిస్తున్నావే."

"అదీ తప్పే?"

"పాపం ఆయన కెట్లా వుంటుంది? యెంత ఆశా మోహమూ లేకపోతే యిట్లా పనులన్నీ చెరుపుకొని నీ చుట్టూ తిరుగుతాడు? వాణ్ణి సంతుష్టి చేసే వుద్దేశం లేని దానివి యెందు కతని కా ఆశ కల్పించడం?"

"పరస్త్రీని కోరేవాడు మరి తిప్పలు పడవద్దూ?"

"అన్నయ్యతో చెప్పి తన్నించు. కాని అన్యాయంగా యీ దొంగ ఆశ లెందుకు?"

"చాలదు. యీ శిక్షతో సమానమయింది లేదు."

వొదిన ముందున్న మాటలకీ యీ మాటలకీ విరుద్ధం కనబడ్డది. కాని, యెట్లా అడగాలో తెలియక వూరుకున్నాను.

"చూడు మళ్ళీ వచ్చాడు. వీడు వెళ్ళిపోతే యీ రోజంతా యేం తోస్తుంది మనకి?"

"సంగీతం వచ్చేమో పాడిద్దాం. ముగ్గులు వెయ్యగలదేమో! అన్నయ్య కోప్పడకుండా ఆ గడియారం బిగించిపెట్టటం చాతనవుతుందేమో!"

"వుండు ఒక తమాషా చేస్తాను" అని కిటికీదగ్గిరికి వెళ్ళింది.

"రాత్రి దొడ్లో పాకదగ్గిరకు రండి; యెంత ఆలస్యమైన, నేను వొచ్చిందాకా అక్కడే వుండండి" అంది.

అతని సంతోషం చూస్తే ఆ రోడ్డుమీదే రెండు మూడు పల్టీలు కొట్టి ఒక యెంకిపాట పాడతాడనుకున్నాను కాని వొదిన సాహసం చూస్తే నాకు భయమేసింది.

"యేమిటది?"

"నువ్వారుకో"

మొత్తానికి తోచకుండా వుండడం పోయింది. వొదిన చప్పుచప్పున వంటచేసింది. వొదిన సంభ్రమం చూస్తే మాత్రం నాకు భయంగావుంది. వాడితో యెంతవరకు చనువు తీసుకొంటుందో, నేనేం చెయ్యాలి? యెట్లా అభ్యంతరం పెట్టను? అన్నయ్యేమంటాడు? వాడు ఆమెని వొదిలి నన్ను—

సాయంత్రమే మంచి వెన్నెల వొచ్చేసింది. కాని అపరిమితమైన చలి ప్రారంభించింది. వంటింటి కిటికీకి తడికకట్టి దాని వెనక యిద్దరమూ కూచున్నాము. సందులోనించి గోడమీదికి మెల్లిగా వొచ్చి యిటు అటు చూసి గుమ్మంవంక ఒక్కనిమిషం చూసి పాకలో దూరాడు. నేను, భయమూ కనికరమూ మరిచిపోయినాను. వొదిన వుత్సాహంతోపాటు నాకు అల్లరితనం పుట్టుకొస్తోంది. లోపల లోపల నవ్వుతో చప్పుడులేకుండా చప్పట్లు కొడుతూ కూచున్నాను. దొడ్డి నిశ్శబ్దమయింది. మే మిద్దరం పోయి పడుకున్నాము.

"యేంచేద్దాం?" అన్నాను.

"నిద్రపోదాం."

"వాడూ?"

"అంతే. వుండనీ. ఒక్కనిమిషం పడుకుందాం?"

యేదో దొడ్లో పెద్ద తమాషా జరుగుతున్నట్లు వొదిన నిమిషానికో సారి దొడ్లోకి పరిగెత్తడం, వీలైతే నన్నుకూడా లాక్కుపోవడం, వొచ్చి మళ్ళీ పడుకోడం. కాని యేమీ జరగంది ఆ వుత్సాహం తనలో తా నెంత సేపు కల్పించుకోగలదు? పదింటికి కళ్ళు మూసుకున్నాము. కాని నాకు నిద్రరాదు. ఆ పాకనిండా పురుగులు, పేడకంపు, వొణుకెత్తించే ఆ చలిలో యెట్లా కూచున్నాడో ఆ మహానుభావుడు? ఆ ఆవువెనక నక్కాడు

గావును, యీ చలికి ; ఆ ఆవుకి జబ్బు, మూలుగుతుందికద అనుకుని ఆపడానికి వీల్లేకుండా నవ్వాను.

"సరే వాడి గతేమిటి?"

"చావనీ"

మళ్ళీ ఆలోచించాను. పాపం యెంత ఆశతో మేలుకొని కూచు న్నాడో? పోనీ నేను వెళ్ళిపొమ్మంటే? వొదిన నన్ను వెళ్ళనిస్తుందా? పోనీ వొదిన నిద్రపోయింతరువాత వెళ్ళి చెపితే? వాడు నన్ను వొదిన అనుకుంటే? ఇట్లా ఆలోచిస్తూ నిద్రపోయినాను.

పన్నెండింటికిగావును, వొదిన నన్నులేపి తమాషా చూపిస్తానని లాక్కెళ్ళింది. దొడ్డితలుపు దగ్గిరికి గబగబా నడిచి గడియ తీస్తున్నట్టే చప్పుడుచేసింది. వాడు చప్పున లోపల్నించి వెన్నెట్లోకి దూకాడు. మళ్ళీ ఆగింది. ఎదురు చూసి చూసి పక్కదొడ్లోకిచూసి లోపలికివెళ్ళాడు. మళ్ళీ చప్పుడు చేసింది. మళ్ళీ బైటికి దూకాడు. వొచ్చి మళ్ళీ పడుకున్నాం.

"ఇప్పుడన్నా పంపిచెయ్యి."

"అట్లా కాదు, నువ్వు కిటికీదగ్గిరికివెళ్ళి తిట్టు" అంది. నేను ఒప్పుకోలేదు. చివరికి తనేవెళ్ళి గడియ చప్పుడుచేసి బైటికిరప్పించి వాణ్ణి కిటికీకి దూరంగా నుంచొని మారు గొంతుకతో,

"యెవరదీ?" అని,

పాడుతిట్లన్నీ ప్రారంభించింది. వాడు పాకలో దూరాడు. మళ్ళీ నిద్రపోయినాను, నేను. రెండుగంటలప్పుడు తలదగ్గిర కిటికీ చప్పుడైై లేచి చూశాను. వెన్నెట్లో సందులో నుంచునివున్నాడు. భయమేసింది. కిర్రీయాడబెరికి లాడుకద; నన్నుచూసి వొదినని లేపమని సౌంజ్ఞలు చేశాడు. నా భయంచూసి వొదినలేచి పకపక నవ్వింది. వాడు దొడ్డివేపు వెళ్ళాడు.

తెల్లారి లేచికూడా దొడ్లోకి వెళ్ళడమంటే భయమేసింది. పాలన్నా పితకలేదు ఆవుకి. వొదిన వాకిట్లో ముగ్గుపెడుతోంది. వీధంతా ప్రతీ గుమ్మంలో గొబ్బెమ్మలు పెడుతున్నారు. నేను వసారాలో నుంచుని చూస్తున్నాను. ముసుకేసుకుని మెల్లిగా వొకడు వీధివెంబడి వొస్తున్నాడు. మా యింటికెదురుగా రాగానే ఆగి వొదిన పక్కన నిలబడ్డాడు. అన్నయ్యేమోననుకున్నాను. వొంగుని ముగ్గు పెడుతున్న వొదిన చప్పున నుంచుంది. తటాలున వొదిన్ని కావిలించుకుని గట్టిగా కదలకుండా పట్టుకుని, అదుముకుని బుగ్గమీద కొరికి, వొదిలి గబగబ వెళ్ళిపోయినాడు, వొదిన 'అబ్బా' అని అణుచుకొని అరిచి, లోపలికి వొచ్చేసింది. నేను గడియ పెట్టాను. వాడిపళ్ళు రెండువరసలూ దిగబడ్డాయి పాపం. పట్టీలు తగిలించి కట్టు కట్టాము కొంచెం నయంగా వుండగా అన్నయ్య వచ్చాడు

"ఇదేమి"టన్నాడు.

నేను నవ్వుతో "అందరికీ కంటి మీదలేస్తే వొదినకి దవడమీద లేచింది ఆకాశకురుపు" అన్నాను.

వూళ్ళో పుకారుగా వుంది. వొదిన పుట్టింటికి వెళ్ళింది.

★